క్లుప్తంగా

వైద్యులు సమయపాలన పాటించాలి



రికార్డు తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

ముత్తారం: ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేషెంట్ల నమోదు, ల్యాబ్ పరీక్షలు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగేలా వైద్యం చేయాలని వైద్యుడు అమరేందర్‌రావుకు సూచించారు.

మంత్రుల సభ విజయవంతం చేయాలి

ధర్మారం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 3న రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి వస్తున్న రాష్ట్ర మంత్రుల సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి కోరారు. ధర్మారంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డుల పంపిణీకి హాజరవుతున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌కుమార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, మాజీ వైస్ చైర్మన్ కాడే సూర్య నారాయణ, రాజేశంగౌడ్ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌లలో నమూనాల సేకరణ

మంథనిరూరల్: మంథని మండలంలోని ఎగ్లాస్‌పూర్, సిద్దపల్లి గ్రామాల్లోని మినరల్ వాటర్ ప్లాంట్‌ల నుంచి వైద్యారోగ్య సిబ్బంది నీళ్ల నమూనాలు సేకరించారు. వర్షాకాల సీజన్‌లో నీటి ద్వారా సీజనల్‌వ్యాధుల నియంత్రణలో భాగంగా డీఎంహెచ్‌వో డా.అన్నప్రసన్న కుమారి ఆదేశాల మేరకు గద్దలపల్లి పీహెచ్‌సీ వైద్యులు డా.సృజన్ ఆధ్వర్యంలో నమూనాలు సేకరించారు. వీటిని జిల్లా టెస్టింగ్ ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. హెచ్‌ఈవో శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు దామోదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..

పెద్దపల్లిరూరల్: శ్రావణ శనివారం సందర్భంగా పెద్దపల్లి ప్రాంతంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు హనుమాన్ ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. కలెక్టరేట్ ఆవరణలోని ఆలయంలోనూ అభిషేకాలు, పుష్పార్చన చేశారు. రంగంపల్లి, చందపల్లి, స్టేషన్‌రోడ్డు, ఎల్లమ్మచెరువుకట్ట హనుమాన్ ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టిసారించాలి

ఎలిగేడు: రైతులు ఒక ఎకరం వరి పండించే పెట్టుబడితో మూడెకరాల భూమిలో ఆయిల్ పామ్ పంట సాగు చేసుకోవచ్చని, ఆ దిశగా రైతులు ఆయిల్‌పామ్ పంటపై దృష్టిసారించాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి సూచించారు. మండలంలోని నర్సాపూర్‌లో శనివారం కొత్తిరెడ్డి మల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రెండున్నర ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట వేశారు. ఇదే రైతు ఏడాది క్రితమే ఐదు ఎకరాలలో ఆయిల్‌పామ్ పంట సాగు చేశాడు. ఆయిల్‌పామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్, రైతులు పాల్గొన్నారు.

సివిల్స్ సర్వీస్‌కు ఉచిత శిక్షణ

యైటింక్లయిన్‌కాలనీ: మౌలానా ఆజాద్ యూనివర్సిటీలో సివిల్స్ సర్వీస్ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జమాత్ ఇస్లామీ హింద్ గోదావరిఖనిశాఖ వైస్ ప్రెసిడెంట్, టీమ్రీస్ కౌన్సిలర్, హెచ్‌ఎంఎస్ జాతయ కార్మిక నాయకుడు ఎండీ ఇస్మాయిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు యూనివర్సిటీ ఏడాది పాటు ఉచితంగా భోజనం, వసతితో పాటు శిక్షణ అందిస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి, డిగ్రీ సర్టిఫికెట్‌లతో పాటు ఒక ఫొటో కాపీతో ఈనెల 5తేదీలోగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉచిత శిక్షణ పొందేందుకు విశ్వవిద్యాలయం నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణుల వ్వాలని పేర్కొన్నారు. వివరాలకు 85208 60785 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



అర్ధశతాబ్ద స్నేహం..



కాల్వశ్రీరాంపూర్: మా స్నేహం అర్ధశతాబ్దం.. కల్మషం లేనిది.. అరేయ్, ఒరేయ్ పలకరింపులు.. అభిప్రాయభేదాలు మాకు.. తామరాకు మీద నీటి చుక్కలే. రోజూ వీడియో కాల్ మాట్లాడకుంగా నిద్రపోము. వీడియోకాల్ మరింత శక్తి, ఉత్సాహాన్ని నింపుతుంది. ఫ్రెండ్స్ ఫోన్ చేసి పలకరిస్తే ఒంట్లో నలత దూరమే. వీడియోకాల్ మాట్లాడినప్పుడు మిత్రులందరూ పక్కనే ఉన్నట్లు ధైర్యం. వెలకట్టలేని స్నేహం ఒక్కటే ప్రాణం ఉన్నంత వరకు గుండెల్లో నిలిచిపోతుంది.

– కొల్లూరు ఆనందం, కాల్వశ్రీరాంపూర్, జెడ్పీహైస్కూల్ పూర్వ విద్యార్థి

గొప్ప వరం



స్నేహం గొప్ప వరం. చదువుకునే రోజులు, ఉద్యోగం చేసేటప్పుడు, ఉద్యోగ విరమణ, పిల్లల వివాహాల సమయంలో స్నేహితులు తోడుగా ఉన్నారు. చివరివరకు స్నేహితుల మధ్య గడపాలని కోరుకుంటున్నా. స్నేహితులతో గడిపితే మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది.

– రావికంటి హరిప్రసాద్, కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్ పూర్వవిద్యార్థి, సోషల్ వెల్ఫేర్ స్కూల్ రిటైర్డ్ ప్రిన్సిపాల్

మిత్రులంటే ఇష్టం



యైటింక్లయిన్‌కాలనీ: చిన్నప్పటి నుంచి నాతోపాటు చదువుకున్న తోటి మిత్రులంటే నాకు చాలా ఇష్టం. వారిలో ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే సాయం అందించడానికి ముందుంటా. స్నేహితులందరం ఒకటే. మాలో ఎవరికి ఎలాంటి ఆపద, సమస్య వచ్చినా అందరం ఉన్నామనే ధైర్యం ఇవ్వడం, చేయూత అందించడమే మా లక్ష్యం. మేమంగా ఎప్పటికీ కలిసిమెలిసి ఉంటాం.

– మొగిలి మురళి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, హైదరాబాద్

ఎత్తిపోతలకు ఏడేళ్లు

- మంత్రి ప్రారంభోత్సవంతో జాతికి అంకితం
- నియోజకవర్గంలో 20వేల ఆయకట్టుకు సాగునీరు



ముర్మూర్ ఎత్తిపోతల పంపుహౌజ్

రామగుండం: తలాపున ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉన్నా రాష్ట్రవ్యాప్తంగా తాగు, సాగునీటి అవసరాలను తీరుస్తున్నప్పటికీ ప్రాజెక్టు నిర్మించిన నియోజకవర్గంలో మాత్రం సాగునీటికి రైతాంగం తిప్పలు పడుతోంది. రామగుండం నియోజకవర్గ పరిధిలో 20వేల ఎకరాలకు సమృద్ధిగా రెండు పంటలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ.75.74కోట్ల వ్యయంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 ఫిబ్రవరి 27న అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఏడేళ్ల నిరీక్షణ తర్వాత రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ప్రత్యేక చొరవతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతల పనులు పూర్తి చేయించి ఎట్టకేలకు 2025 ఆగస్టు 3న భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసి జాతికి అంకితం చేయనున్నారు. ఎస్సారెస్పీ డీ–83 కాలువ ద్వారా 27ఎల్, 17ఎల్ ఉపకాలువలకు ఎత్తిపోతలను అనుసంధానం చేయడంతో చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా సమృద్ధిగా సాగునీరు సరఫరా కానుంది.

ఎత్తిపోతలకు ప్రత్యేక పంపుహౌజ్ ఏర్పాటు..

ఎత్తిపోతల పంపుహౌజ్ ప్రాంగణంలోనే 1500 కిలోవాట్స్ సామర్థ్యంతో నడిచే మూడు భారీ మోటార్లు పంపులకు ప్రత్యేకంగా రూ.1.90 కోట్లతో 33/11 కేవీ సామర్థ్యంతో సబ్‌స్టేషన్ నిర్మించారు. కాగా స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో టీజీఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారుల మీద ఒత్తిడి తీసుకువచ్చి 9రోజుల్లో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి పదోరోజు పవర్‌గ్రిడ్‌కు అనుసంధానించి రాష్ట్రంలోనే రికార్డు సృష్టించారు.

ఆదిలోనే మరుగునపడిన ఎల్లంపల్లి టూరిజం సర్క్యూట్..

బీఆర్‌ఎస్ హయాంలో కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ అభివృద్ధికి రూ.750 కోట్ల నిధులు కేటాయించింది. అందులో ఎల్లంపల్లి ప్రాజెక్టును పర్యాటకంగా తీర్చిదిద్ది కోటిలింగాలకు (20 కి.మీ) బోటింగ్ నడిపించాలని అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ కార్యాచరణ రూపొందించారు. ఆదిలోనే పర్యాటకం మరుగున పడింది. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపించి టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు ప్రాజెక్టు వద్ద ఉద్యానవనం, స్టాల్స్, బోటింగ్ ఏర్పాటుతో పర్యాటకుల సందడి పెరగనుంది.

ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభించలేకపోయాం

గోదావరిఖని: ఎన్నికల కోడ్ రావడంతో రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించలేకపోయామని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎల్లంపల్లి వద్ద గోదావరి నదిపై శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించినప్పటికీ ఇక్కడి రైతులకు చుక్క నీరు ఇవ్వకుండా అరిగోస పెట్టిందని, ఎక్కడో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిపైనే రామగుండం రైతులు ఆధారపడాల్సి దుస్థితికి కారణం కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే దాదాపు ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పనులన్నీ పూర్తయ్యాయన్నారు. కుక్కలగూడూర్ రైతులను అడిగితే ఈ విషయం చెప్తారని, తాము చేపట్టిన పనులను వారు ఏదో సాధించినట్టుగా ఫోజులు కొట్టడం సిగ్గుచేటన్నారు.

విద్యార్థుల పొలంబాట



జ్యోతినగర్: కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు శనివారం పొలంబాట పట్టారు. గోదావరిఖని కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు మంజుల–శ్రీనివాస్ రెడ్డి ప్రోత్సాహంతో పాఠశాల విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన పెంచే లక్ష్యంతో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మేడిపల్లి సెంటర్ సమీపంలోని వ్యవసాయ క్షేత్రాన్ని, నాటు ప్రక్రియను ప్రత్యక్షంగా చూశారు.

సంక్షిప్త వార్తలు

• కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సుల్తానాబాద్: పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రమేశ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం పారిశుధ్య కార్మికులకు, వాటర్ సప్లై, వివిధ రకాల సిబ్బందికి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. మేనేజర్ అలీమొద్దీన్, ఏఈ రాజ్‌కుమార్, గర్రెపల్లి ప్రాథమిక వైద్యులు ఉదయ్‌కుమార్, సింధూజ, ఎల్‌టీ శ్రీనివాస్, స్వప్న, హెచ్‌వీ ఎలిజబెత్, ఏఎన్‌ఎం వినోద, సరస్వతి ఉన్నారు.

• మోడల్‌స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాలలో ఉన్న మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలలో 2025–26కి సంబంధించిన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్ మొదటి సంవత్సరంలో (బైపీసీ, సీఈసీ, ఎంఈసీ)లో మిగిలిన సీట్లకు అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్ కోసం ఆగస్టు 4వ నుంచి 8వ తేదీ వరకు మోడల్ స్కూల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

• ఎత్తిపోతల ప్రారంభానికి తరలిరావాలి

రామగుండం: ముర్మూర్ ఎత్తిపోతల ప్రారంభోత్సవానికి ఆదివారం వివిధ గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని మండల వ్యవసాయాధికారి కల్వల సతీశ్ కోరారు. శనివారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించి రైతులను సమాయత్తం చేశారు. మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌గౌడ్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరుకానున్న కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని చేయాలని కోరారు.

• ఇంటర్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల(బాలికల) కళాశాలలో మిగిలిన ఇంటర్ సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గిరిజ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో చేరడానికి అర్హత కలిగిన విద్యార్థులు 5న ఉదయం 9గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

• లొంకకేసారం అభివృద్ధికి నిధులు కేటాయించండి

రామగిరి: మండలంలోని లొంకకేసారం గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని లొంకకేసారం మాజీ సర్పంచ్ ఎండీ మంజూర్ కోరారు. శనివారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాభివృద్ధికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు మంజూర్ తెలిపారు. ఎండీ ఆలీమ్ ఉన్నారు.

• విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు అందజేత

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కాలనీకి చెందిన మంజు అబాకస్ నిర్వాహకురాలు మంజుల జ్యోతి గాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు.

• ఢిల్లీలోని రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు స్థానిక న్యాయవాదులు

రామగుండం: జాతీయ కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో శనివారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ లీగల్‌సెల్ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మన్విసింగ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ న్యాయవాద సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రామగుండంకు చెందిన యువ న్యాయవాదులు సింగం జనార్దన్‌గౌడ్, సాయిచంద్ హాజరయ్యారు.

• సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య అన్నారు. పట్టణంలోని హోలీఫేత్ ప్రైమరీ స్కూల్‌లో శనివారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎవరైనా మహిళలు, విద్యార్థులు వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సభ్యులు మౌనిక, స్నేహలత, సురేశ్, జార్జిరెడ్డి పాల్గొన్నారు.

• డ్రగ్స్‌ను రూపుమాపేందుకు సంఘటితం కావాలి

ధర్మారం: డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపేందుకు సంఘటితంగా పోరాటం చేయాలని నశాముక్త భారత్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల అన్నారు. మండలంలోని దొంగతుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం డ్రగ్స్ వాడడంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులతో కలిసి యాంటీ డ్రగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

• పింగళి వెంకయ్య జయంతి

గోదావరిఖనిటౌన్: జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమర యోధుడు పింగళి వెంకయ్య జయంతి శనివారం స్థానిక అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో ప్రేమ చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు దాసరి స్వప్న మహేశ్, పాఠశాల కరస్పాండెంట్ సూర్యదేవర జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• చలో గోవా పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌పూర్: గోవాలో ఈ నెల 7న నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబీసీ పదో మహాసభను విజయంవంతం చేయాలని మండల కేంద్రంలో బీసీ నాయకులు చలో గోవా పోస్టర్ ఆవిష్కరించారు. నల్లవెల్లి శంకర్, తాటికొండ శంకర్, తోట రాజ్‌కుమార్, పోలుదాసరి సాయికుమార్, బొమ్మగాని అనిల్, మచ్చగిరి రాము, కమ్మగోని మల్లయ్య, కొట్టె భూమయ్య పాల్గొన్నారు.

మిర్చీలు వేస్తూ.. సమస్యలు ఆలకిస్తూ



మిర్చీలు వేయిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తాలో శనివారం రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పర్యటించారు. ఈ సందర్భంగా చౌరస్తా సమీపంలో మిర్చీ హోటల్ వద్దకు వెళ్లి మిర్చీ నూనెలో కాల్చుతూ కొద్దిసేపు వ్యాపారస్తులతో ముచ్చటించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి ఉన్నారు.

కవిత నిరవధిక నిరాహార దీక్ష విజయవంతం చేయాలి

గోదావరిఖని: బీసీ బిల్లు సాధన కోసం తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో నిర్వహించే కల్వకుంట్ల కవిత నిరహార దీక్షలో బీసీ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని యూపీఎఫ్ రాష్ట్ర కో–కన్వీనర్ పెద్దాపురం కుమారస్వామి, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు పెంట రాజేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలయ్యేలా ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు. నాయకులు బండారి శ్రీను, అండె సదానందం, హారిక, నిట్టూరి రాజు, ఆవుల రాజేశ్, భూమేష్, సాయికృష్ణ పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు తనిఖీ

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ సున్నపురాయి గనులను శనివారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ సౌత్ సెంట్రల్ జోన్ బృందం తనిఖీ చేసింది. టీఆర్ కన్నన్ నేతృత్వంలో అశోక్‌కుమార్, నాగేశ్వరరావుతో కూడిన బృందం సిమెంట్ కంపెనీలో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలు, చర్యలను పరిశీలించారు. కంపెనీలో జీరో ఆక్సిడెంట్ లక్ష్యాన్ని సాధించేందుకు భద్రతా చర్యలను మరింత పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. అంతకుముందు తనిఖీ బృందం సభ్యులకు కంపెనీ యూనియన్ నాయకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గోదావరిఖని: స్థానిక అశోక్‌నగర్‌లో కొనసాగుతున్న పేకాట స్థావరంపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు శనివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని రూ.12వేల నగదు, నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వాహకుడు, పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న యూత్ ప్రతినిధులు

ధర్మారం: వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడంలో మొక్కల పెంపకం ముఖ్యపాత్ర పోషిస్తుందని యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రేషవేని మహేశ్ అన్నారు. మండలంలోని పత్తిపాక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శనివారం యువశక్తి యూత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి స్వాతి మాట్లాడుతూ స్వచ్ఛమైన వాతావరణం కోసం ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, మాజీ సర్పంచు బద్దం సుజాత, యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సోను, కార్యదర్శి రాహుల్ ఇర్ఫాన్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్: రాష్ట్రంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నూతనంగా నియామకమైన కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గ అభినందన సభను శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. కాగా ఈ కార్యక్రమానికి మంత్రి పాల్గొని నూతన పాలకవర్గ సభ్యులను సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నిధులు కేటాయించి గుండారం రిజర్వాయర్‌ను ఆధునీకరిస్తామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ అన్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, కోలేటి మారుతి, చొప్పరి సదానందం, ఏఎంసీ కార్యదర్శి ఈర్ల సురేందర్ పాల్గొన్నారు.

మెడికల్ బోర్డులో కార్మికులకు అన్యాయం

గోదావరిఖని: గుర్తింపు యూనియన్ వైఫల్యంతో మెడికల్ బోర్డులో సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగిందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. స్థానిక సాయిలీలా హోటల్‌లో శనివారం రాత్రి యూనియన్ కోర్‌కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. అన్ని ఏరియాల్లో యూనియన్ సభ్యత్వం చేయాలని, 11న సింగరేణి పరిరక్షణ కోసం సింగరేణివ్యాప్తంగా ఆందోళనలకు శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలు తెలుసుకోవడానికి త్వరలో సింగరేణివ్యాప్తంగా ఐఎన్‌టీయూసీ యాత్ర నిర్వహిస్తుందని పేర్కొన్నారు.

పూర్తయిన పంపుహౌజ్‌ను ప్రారంభించడం హాస్యాస్పదం



మాట్లాడుతున్న కౌశిక హరి

రామగుండం: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే 99శాతం పంపుహౌజ్ నిర్మాణం పూర్తయి ఎత్తిపోతలు కొనసాగుతున్న దానికి నీటిపారుదలశాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్‌ఎస్ కార్మిక సంఘం నేత కౌశిక హరి అన్నారు. శనివారం ఆయన తన అనుచరులతో కలిసి ముర్మూర్/బ్రాహ్మణపల్లి పంపుహౌజ్‌ను సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ అధికారంలోకి రాగా ఇప్పటివరకు ఎన్ని అమలు చేశారో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మాజీ ప్రజాప్రతినిధులు మేర్గు పోశం, బండారి ప్రవీణ్‌కుమార్, తిరుపతినాయక్, గాలెంకి ప్రసాద్, దబ్బెట తిరుపతి, ఒల్లెపు మల్లేశ్, కొంతం సత్తయ్య, గోనె రాజయ్య, కుమ్మరి రవి, మాణిక్యం కుమార్, మహేశ్, మాటేటి రమేశ్, హనుమ నరేశ్, ఎస్‌కే.అమీన్, భార్గవ్, మద్దికుంట శంకర్ ఉన్నారు.

అరుణ నారదభట్లకు సినారె సాహిత్య పురస్కారం



అరుణ

మంథని: మంథనికి చెందిన ప్రముఖ కవయిత్రి అరుణ నారదభట్ల ప్రతిష్ఠాత్మక సినారె సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. సినారె 94వ జయంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో అవార్డు ప్రదానం చేయనున్నారు. 2016లో ఇన్నాళ్ల మౌనం తర్వాత, 2022లో లోపలి ముసురు పేరుతో కవితా సంపుటాలను ప్రచురించారు. 500కు పైగా అంశాలపై ఆమె ఛందోబద్ధ పద్యాలు రచించారు. అనేక పత్రికల్లో ఆమె రాసిన కవితలు అచ్చయ్యాయి. అరుణ భర్త ఎం.నారాయణశర్మ ప్రముఖ సాహిత్య విమర్శకులు. అరుణ సినారె పురస్కారానికి ఎంపిక కావడంపై సమైక్య సాహితీ సహా పలు సాహితీ సంస్థలు హర్షం ప్రకటించాయి.

తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరం



ఓదెల: మడకలో అవగాహన సదస్సు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట, రాఘవాపూర్‌లో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వాతి అవగాహన కల్పించారు. రాఘవాపూర్‌లో టీచర్ శ్రీదేవి బాలింత, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. అప్పన్నపేటలో టీచర్ మండల విమల, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఓదెల: పిల్లలకు తల్లిపాలు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. మండలంలోని మడకలో అవగాహన సదస్సు జరిగింది. కార్యదర్శి జ్యోతి, ప్రధానోపాధ్యాయులు అశోక్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పట్టణంలోని అశోక్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్రెపల్లి పీహెచ్‌సీ హెచ్‌ఈవో అనూసోద్దీన్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలంలోని నర్సాపూర్ అంగన్‌వాడీ కేంద్రం–1, కేంద్రం–2, శివపల్లిలోని కేంద్రం–1ను కలిపి శివపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, కళావతి, హేమలత పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ కేంద్రం టీచర్లు నర్మద, ఉమారాణి, ఆశావర్కర్ దేవేంద్ర పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

సుల్తానాబాద్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గట్టయ్య మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. జనగామలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు 25 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు వివరించారు. ఇందులో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పట్టిపల్లి ప్రకాశ్ రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.శ్రీధర్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి కె.సునీల్ తెలిపారు.

అమ్మపాలు అమృతం

కోల్‌సిటీ: తల్లిపాలు అమృతంతో సమానమని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ అన్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో శనివారం తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమం నిర్వహంచారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలు పట్టించాలన్నారు. అనంతరం పాలు పట్టించే విధానంపై అవగాహన కల్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, డాక్టర్లు శిరీష, రాజీవ్, జ్యోతి, రామ్మూర్తి, స్వాతి, నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.